విరమణ డ్రైవర్‌కు ఎమ్మెల్యే సన్మానం

అన్నపూర్ణమురళీగౌడ్ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

రెబ్బెన, జనవరి 31 : ఆర్టీసీ డ్రైవర్‌గా 30 ఏళ్లు విధులు నిర్వహించి, విరమణ పొందిన రెబ్బెన మండల కేంద్రానికి చెందిన మురళీగౌడ్–అన్నపూర్ణ దంపతులను శుక్రవారం మంచిర్యాల డిపోలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి సన్మానించారు. శుభాకాంక్షలు తెలిపి, ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, మాజీ వైస్ ఎంపీపీ గజ్జల సత్యనారాయణ, మాజీ ఉపసర్పంచ్ బొమ్మినేని శ్రీధర్, బీఆర్ఎస్ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి కుందారపు శంకరమ్మ, మండలాధ్యక్షురాలు అన్నపూర్ణ అరుణ, బీఆర్ఎస్ నాయకులు రాపర్తి అశోక్, మోడెం సర్వేశ్వర్‌గౌడ్, అప్పు, శ్రీకాంత్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ ఫస్టియర్ ఇంగ్లిష్ ప్రయోగ పరీక్షలు

పీటీజీ గురుకులంలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న అబ్జర్వర్ సంతోష్

ఆసిఫాబాద్ టౌన్, జనవరి 31 : ఇంటర్ ప్రథమ సంవత్సరం ఇంగ్లిష్ ప్రయోగ పరీక్ష శుక్రవారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. పీటీజీ గురుకులం పరీక్షా కేంద్రాన్ని ప్రిన్సిపాల్ భద్రయ్యతో కలిసి అబ్జర్వర్ సంతోష్ పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 48 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి కల్యాణి తెలిపారు. 4,807 మందికి గాను 4,445 మంది విద్యార్థులకు హాజరయ్యారని, 362 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు

తాళ్లపేటలో ఫ్లెక్సీలను తొలగిస్తున్న జీపీ సిబ్బంది

దండేపల్లి, జనవరి 31 : పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో దండేపల్లి మండల కేంద్రంతో పాటు, పలు గ్రామాల్లో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్లను పంచాయతీ అధికారులు, సిబ్బంది తొలగిస్తున్నారు. కోడ్ అమల్లోకి రావడంతో ఎలాంటి రాజకీయ ప్రచార బ్యానర్లు, పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయవద్దని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

నస్పూర్, జనవరి 31 : ప్రభుత్వ పాఠశాలల్లోని పదోతరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని మంచిరాయల డీఈవో యాదయ్య సూచించారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు ఫిబ్రవరి 1 నుంచి రివిజన్ క్లాసులు నిర్వహించాలని సూచించారు. నిత్యం ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, ఎంఈవోలు పరిశీలించాలన్నారు. ఫిబ్రవరి 17 నుంచి గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తున్నామని, తర్వాత ప్రీ ఫైనల్ పరీక్షలకు సంసిద్ధులను చేయాలని సూచించారు. ఏసీజీఈ దామోదర్‌రావు, డీసీఈబీ కార్యదర్శి కొండు భీంరావ్, సెక్టోరల్ అధికారి చౌదరి, కుమారస్వామి, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖుర్షీద్ అలీ సేవలు అమోఘం



ఖుర్షీద్ దంపతులను సన్మానిస్తున్న ఆర్డీవో శ్రీనివాస రావ్

హాజీపూర్, జనవరి 31 : రెవెన్యూశాఖలో 33 ఏండ్లుగా వివిధ హోదాల్లో విధులు నిర్వహించి శుక్రవారం విరమణ పొందిన ఖుర్షీద్ అలీ సేవలు అమోఘమని ఆర్డీవో శ్రీనివాసరావు అన్నారు. హాజీపూర్ తహసీల్ కార్యాలయంలో జూనియర్ అస్టిటెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఖుర్షీద్ అలీ విరమణ కార్యక్రమానికి హాజరై, సన్మానించారు. ఆయన శేష జీవితం ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస రావ్ దేవ్ పాండే, డీటీ రాజేశ్వర్ రావ్, నస్పూర్ తహసీల్దార్ హరిత, మండల రెవెన్యూ అధికారులు ఏసయ్య, మంగ, మండల వ్యవసాయ శాఖ, ఉపాధి హామీ కార్యాలయాల సిబ్బంది, సెర్ప్ అధికారులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్ తనిఖీ

తాండూర్, జనవరి 31 : మండల కేంద్రంలోని 108 అంబులెన్స్‌ను శుక్రవారం ఈఎంఈ అధికారి సంపత్ తనిఖీ చేశారు. ప్రాథమిక వైద్య పరికరాలు, మెడికల్ కిట్లు, మందులు, రికార్డులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పైలట్ ఖలీల్, ఈఎంటీ ప్రశాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

PUBLIC NOTICE

My client by name **PULLAKOLLA NAGARAJU,** S/o. Mallaigh, Age: 39 years, Occ: Govt. Employee, R/o. H. No. 51-31, Deepak Nagar. Mancherial, Mdl: Mancherial, Dist.: Mancherial, he has lost his land original registered link Document No. 2533/2007, Dt. 22-06-2007, which were registered before SRO Sultanabad, while he was travelling from Mandamari to Somagudem on 28-01-2025, he tried to trace out the same but in vain. If any one finds the above said document, they shall have handover the same to me. He approaches Telangana Grameena Bank, Seetharampally Branch for obtaining loan and also anyone is having any objections about the property covered under Register Gift Deed inform to the below address within one week from the date of publication otherwise the Bank will proceed further.

SCHEDULE OF PROPERTY

RCC house bearing No. 4-52/1(PTIN No: 320109400436), in house plot an extent of 968.00 Sq. Yds equivalent to 809.66 Sq. Meters, situated in Sy. No. 331 (As per Nala Sy. No. 331/F/1/1/1/1/2 & 331/F/1/1/1/1/2/1) of Kothur Shivar, Within the limits of Kothur Gram Panchayath, Md: Darmaram. Dist. Peddapally.

BOUNDARIES: East : Land of Pullakolla Malialah. West: R & B Road Leads to Julapaly. North: Cart Way, South: House of Naruvatla Yoganandam & Land of Neruvatla Vinay Kumar.

Yours sincerely

Sd/- **N.Kamala Manohar Rao,** Advocate
4-197, Near LIC Office, Mancherial.

ఎల్ ఆర్ఎస్ దరఖాస్తు ప్రక్రియ పూర్తిచేయాలి

మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, జనవరి 31 : ఎల్ఆర్ఎస్ దరఖాస్తు ప్రక్రియను ఫిబ్రవరి 20లోగా పూర్తి చేసేలా పనులను వేగవంతం సంబంధిత అధికారులకు మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం మున్సిపల్ కమిషనర్లు, నీటి పారుదల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీల్లో పారిశుధ్య నిర్వహన పకడ్బందీగా చేపట్టాలన్నారు. లక్షెట్టిపేట మున్సిపాలిటీలో రూ. 10 లక్షలతో కంపోస్టు షెడ్డు పనులు చేపట్టి, త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అన్ని వార్డుల్లో నిరంతరాయంగా తాగునీటి సరఫరా జరిగేలా పర్యవేక్షించాలన్నారు. వేసవి సమీపిస్తున్నందున తాగునీటి సరఫరాపై ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. ప్రభుత్వ భూముల ఆక్రమణ, సరైన అనుమతులు లేని నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలన్నారు.

కన్నెపల్లి, జనవరి 31 : కన్నెపల్లి మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ కుమార్ దీపక్ పరిశీలించారు. ప్రభుత్వ దవాఖానల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని, సమయ పాలన పాటించాలనిసిబ్బందికి సూచించారు. అనంతరం తహసీల్, ఎంపీడీవో కార్యాలయాలను సందర్శించారు. అధికారులకు సూచనలు చేశారు. వివిధ ధ్రువ పత్రాల కోసం మీ సేవ ద్వారా అందిన దరఖాస్తులను పరిశీలించి, త్వరగా జారీ చేయాలన్నారు. అనంతరం చర్లపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించి, అదనపు గది, వంట శాల, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

బుగ్గ శివారులో పెద్దపులి

కాసిపేట : పెద్దనపల్లి శివారులో గుర్తించిన పులి పాదముద్రలు

బెల్లంపల్లి : పులి పాదముద్రలను గుర్తిస్తున్న అటవీ అధికారులు

బెల్లంపల్లి, జనవరి 31 : కన్నాల గ్రామ పంచాయతీ బుగ్గ రాజరాజేశ్వర స్వామి ఆలయ అటవీ శివారు ప్రాంతంలో పెద్దపులి సంచారం శుక్రవారం కలకలం రేపింది. పెద్ద పులి కదలికలను గుర్తించేందుకు వచ్చిన అటవీ సిబ్బందికి బుగ్గదేవాలయానికి అతి సమీపంలో పులి కనిపించింది. అటవీ ప్రాంతంలోని ఓ నీటి కుంటలో పెద్దపులి నీళ్లు తాగుతుండడాన్ని సిబ్బంది చూశారు. వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఎఫ్ఆర్వో పూర్ణచందర్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకొని పెద్ద పులి పాదముద్రలు గుర్తించారు. మధ్యాహ్నం కన్నాల అటవీ ప్రాంతం మీదుగా పెద్దనపల్లి మామిడి తోటల వైపు పులి వెళ్లినట్లు తెలిసి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. బుగ్గ అటవీ ప్రాంతానికి ఎవరూ వెళ్లవద్దని అధికారులు సూచిస్తున్నారు.

కాసిపేట అటవీప్రాంతాల్లో..

కాసిపేట, జనవరి 31 : పెద్దనపల్లి శివారులోని బెల్లంపల్లి–కాసిపేట మధ్య సింగరేణి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న రోడ్డు మార్గంలో దుబ్బగూడెం లేవుట్ కాలనీలోగల పెద్దమ్మ గుడి సమీపంలో పెద్దపులి పాదముద్రలను అధికారులు గుర్తించారు. గురువారం బుగ్గగూడెం శివారులో సంచరించిన పెద్దపులి శుక్రవారం బుగ్గ దేవాలయం సమీపం నుంచి బెల్లంపల్లి కన్నాల నీలగిరి చెట్ల వద్దకు రాగా, ఫారెస్ట్ అధికారులు ప్రత్యక్షంగా చూశారు. గ్రామాల అతి సమీపంలోనే పెద్దపులి సంచరిస్తుండడంతో ప్రజలు, రైతులు ఆందోళన చెందుతున్నారు.

కార్యాలయానికి నగరపాలక సంస్థ పేరు రాస్తున్న ఆర్టిస్ట్

కార్పొరేషన్ కార్యాలయానికి కొత్త బోర్డు

మంచిర్యాలటౌన్, జనవరి 31: మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి నూతనంగా బోర్డును రాయిస్తున్నారు. ఇప్పటివరకు పురపాలక సంఘంగా ఉన్న మంచిర్యాల.. నగరపాలక సంస్థగా మారడంతో బోర్డును నగరపాలక సంస్థగా మారుస్తున్నారు. ఇప్పటికే విలీన నస్పూరు మున్సిపాలిటీతో పాటు హాజీపూర్ మండలం వేంపల్లి, ముల్కల, పోచంపాడ్, గుడిపేట, నంనూర్, నర్సింగాపూర్, చందనాపూర్, కొత్తపల్లి గ్రామపంచాయతీలకు కార్పొరేషన్ బోర్డులు ఏర్పాటు చేసిన విషయం విదితమే.

మాట్లాడుతున్న డీఆర్డీవో కిషన్

పనులు త్వరగా పూర్తి చేయాలి

మందమర్రి రూరల్, జనవరి 31 : మందమర్రి మండలంలోని సండ్రోన్పల్లి, తుర్కపల్లి గ్రామాల్లోని పాఠశాలల ప్రహరీ పనులు త్వరగా పూర్తిచేయాలని మంచిర్యాల డీర్డీవో కిషన్ సంబంధిత కాంట్రాక్టర్, అధికారులకు సూచించారు. మండలంలోని శంకర్‌పల్లి, సారంగపల్లి, బొక్కలగుట్ట గ్రామాల్లో అభివృద్ధి పనులను శుక్రవారం ఎంపీడీవో రాజేశ్వర్‌తో కలిసి పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు వై రాజమల్లు, కే కుమార్, సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్ హాజరయ్యారు.

నస్పూర్ : మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి అర్పితా మారంరెడ్డి

కెరమెరి : మోడీ పాఠశాలలో మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ శారద

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

నస్పూర్, జనవరి 31 : బాలికలు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని చదువుతోపాటు, అన్ని రంగాల్లో రాణించాలని మంచిర్యాల జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి అర్పితా మారం రెడ్డి సూచించారు. బేటీ బచావో–భేటీ పడావో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు హాజరయ్యారు. ఉత్తమ లక్ష్యాన్ని ఎంచుకొని లక్ష్యసాధన దిశగా అడుగులు వేయాలని సూచించారు. సలహా కోసం డీఎల్ఎస్ఏ ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ నంబర్ 15100ను సంప్రదించాలని తెలిపారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం జిల్లా సమన్వయకర్త సౌజన్య, డిస్ట్రిక్ట్ చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ మహమ్మద్ సందాని, మహిళా సాధికారత కేంద్రం, ఆర్థిక అక్షరాస్యతా నిపుణురాలు లిప్సిక, పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కెరమెరి, జనవరి 31 : సమాజంలో బాలికల సంరక్షణ ఎంతో అవసరమని, ప్రతీ పౌరుడు పాటుపడాలని మహిళా సాధికారత కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కో ఆర్డినేటర్ బీ శారద పేర్కొన్నారు. బేటీ బచావో.. బేటీ పడావో దశాబ్ది ఉత్సవాలను మోడీ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ , మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రిన్సిపాల్ భారతి, ఫైనాన్షియల్ స్పెషలిస్ట్ సాగర్, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

సిర్పూర్(యూ), జనవరి 31 : యువత తప్పని సరిగా క్రీడల్లో రాణించాలని ఆసరా సొసైటీ అధ్యక్షుడు జిల్లపల్లి శంకర్ అన్నారు. మండలంలోని రాఘుపూర్‌లో శుక్రవారం వాలీబాల్ పోటీలు ప్రారంభించారు. మండలస్థాయిలో గెలుపొందిన వారికి జిల్లాస్థాయిలో పాల్గొనే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. నాయకులు సుద్దాల శ్రీనివాస్, సొసైటీ సభ్యులు అంజయ్య, అన్వేష్, కోవ దినేశ్, లింగు క్రీడా కారులు పాల్గొన్నారు.

కోలిండియాస్థాయి పోటీలకు ఎంపిక

శ్రీరాంపూర్, జనవరి 31 : కోలిండియా స్థాయి క్యారమ్స్ పోటీలకు శ్రీరాంపూర్ ఓసీపీలో అటెండెంట్ ఎస్కే తాజుద్దీన్, ఆర్కే–6 గని జనరల్ మజ్దూర్ సైజన్‌రావు ఎంపికయ్యారు. జార్ఖండ్ రాష్ట్రంలో ఈ నెల 3,4,5వ తేదీల్లో జరిగే కోలిండియా స్థాయి క్యారమ్స్ పోటీల్లో సింగిల్స్, డబుల్స్ సింగరేణి జట్టు నుంచి పాల్గొననున్నారు. జీఎం సూర్యనాయణ, డీవై జీఎం అరవిందరావు, పీవో శ్రీనివాస్, ఆర్కే 6 మేనేజర్ తిరుపతి అభినందించారు.

15 నుంచి అంతర్‌జిల్లా క్యారమ్స్ పోటీలు

బెల్లంపల్లి, జనవరి 31 : హైదరాబాద్‌లోని మన్సూరాబాద్ మల్లిఖార్జున నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు 52వ రాష్ట్ర సీనియర్ అంతర్ జిల్లా క్యారమ్స్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి రాచకట్ల బాలరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి తనుగుల రాజన్న తెలిపారు. రంగారెడ్డి జిల్లా క్యారమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. పురుషులు, స్త్రీల సింగిల్స్, డబుల్స్, వెటరన్ పురుషులు, స్త్రీల సింగిల్స్ విభాగాల్లో పోటీలు ఉంటాని తెలిపారు. పాల్గొనేవారు 11వ తేదీలోగా తమ ఎంట్రీలను పంపించాలని వివరించారు. మిగతా వివరాలకు 94400 10404 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సేంద్రియ విధానాలు పాటించాలి

మందమర్రి రూరల్, జనవరి 31 : రైతులు సేంద్రియ సహజ వ్యవసాయ విధానాలు పాటించాలని చెన్నూర్ ఏడీఏ బానోత్ ప్రసాద్ సూచించారు. మండలంలోని పొన్నారం, ఆదిల్‌పేట గ్రామాల రైతుల టమాట పంట క్షేత్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. సహజ వ్యవసాయ విధానాలు, పంట మార్పిడి విధానాల ద్వారా కలిగే ప్రయోజనాలపై ఈ సందర్భంగా రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో ముత్యం తిరుపతి, కనకరాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు చెల్లించాలి

రెబ్బెన, జనవరి 31 : బెల్లంపల్లి ఏరియాలోని పలు విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం బెల్లంపల్లి ఏరియా గోలేటి జీఎం కార్యాలయంలో జీఎం శ్రీనివాస్‌కు సమ్మె నోటీస్ అందించారు. కాంట్రాక్టు కార్మికులు జాడి సాయి, కోట ప్రవీణ్, మారం కుమార్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

వెదురు వస్తువుల తయారీతో ఆర్థికాభివృద్ధి

కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

వెదురు వస్తువుల తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

ఆసిఫాబాద్ టౌన్, జనవరి 31 : వెదురు వస్తువుల తయారీతో సంఘాల ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. ఆసిఫాబాద్ మండలం సాలెగూడ గ్రామ పరిధిలో నిర్మాణంలో ఉన్న వెదురు ప్రాసెసింగ్ యూనిట్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. వెదురుతో వినూత్న వస్తువులు తయారు చేసే ప్రణాళిక రూపొందించాలన్నారు. యూనిట్ పూర్తి చేసేలోగా అవసరమైన వెదురు నిల్వల సేకరణకు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ రామకృష్ణతోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి..

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటశాలతో పాటు, విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకురాగా, పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. కళాశాల సిబ్బందితోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి!

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ దవాఖాన ఎదుట బంధువుల ఆందోళన

రాజేశ్వరి (ఫైల్)

మంచిర్యాల్ అర్బన్, జనవరి 31 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖాలో చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. దండేపల్లి మండలం కన్నెపెల్లి గ్రామానికి చెందిన ముత్తె రాజేశ్వరి (55) అస్వస్థతకు గురికాగా, గురువారం రాత్రి పట్టణంలోని ప్రైవేటు దవాఖానకు తీసుకు వచ్చారు. పరీక్షించిన వైద్యులు గుండె సమస్య ఉన్నదని, స్టంట్స్ వేశారు. చికిత్స విజయవంతమైందని కుటుంబ సభ్యులకు కూడా తెలిపారు. కాగా, శుక్రవారం ఉదయం దవాఖానలోనే రాజేశ్వరి మృతి చెందింది. అయితే వైద్యుల నిర్లక్ష్యం వల్లే మహిళ మృతి చెందిందని బంధువులు ఆరోపిస్తూ మృతదేహంతో దవాఖాన ఎదుట ఆందోళనకు దిగారు. దవాఖానపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దవాఖాన వైద్యులు మాట్లాడుతూ.. గుండె నొప్పితో వచ్చిన రాజేశ్వరికి పూర్తి పరీక్షలు చేసి, గుండెకు రక్త ప్రసరన లేదని, స్టంట్ వేసుకోవాలని, 99 శాతం డెత్ రిస్క్ ఉన్నదని బంధువులకు వివరించామని తెలిపారు. వారు ఒప్పుకున్న తరువాతే వైద్యం అందించామని స్పష్టం చేశారు. గుండెకు సంబంధించిన వాల్ వంద శాతం మూసుకుపోవడంతో బ్లాక్ ఓపెన్ చేసి, స్టంట్ వేసినట్లు, పేషెంట్‌ను ఆలస్యంగా తీసుకరావడం ద్వారా మజిల్ ఎక్కువగా డ్యామేజ్ అయినట్లు తెలిపారు. ఈ విషయంపై పోలీసులను సంప్రదించగా, ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు. కాగా, మృతురాలికి భర్త సత్తన్న, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

మంచిర్యాల అర్బన్, జనవరి 31 : మాదారం ఎంవీకే 5 ఇంక్లైన్‌కు చెందిన (ప్రస్తుత నివాసం మంచిర్యాల) కోట సాయి (25) శుక్రవారం విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు మంచిర్యాల పట్టణ ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. మంచిర్యాలకు చెందిన చక్రపాణి వద్ద లారీ క్లీనర్‌గా సాయి పని చేస్తున్నాడు. కాలేజ్‌రోడ్డులో గల వైకుంఠధామం వద్ద మట్టి అన్‌లోడ్ కోసం తాండూర్‌కు చెందిన లారీ డ్రైవర్ తెండ్ర ఉదయ్‌వర్ధన్ లారీని తీసుకెళ్లాడు. అజాగ్రత్తగా లారీని వెనుకకు తీసి, జాకీ ఎత్తగా, పైన ఉన్న విద్యుత్ తీగలు తగిలాయి. ఈ క్రమంలో సాయి లారీని పట్టుకొని ఉండడంతో షాక్‌కు గురై కిందపడిపోయాడు. వెంటనే స్థానికులు ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తండ్రి కోట నాగేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గ్యాస్ లీకేజీతో విద్యాలయంలో మంటలు

కాగజ్‌నగర్, జనవరి 31 : పట్టణంలోని పెట్రోల్ పంపు ఏరియా మహాత్మా జ్యోతిబా పూలే బాలుర విద్యాలయంలో శుక్రవారం గ్యాస్ లీకేజీతో మంటలు చెలరేగాయి. సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. సాయంత్రం భోజనం వండే క్రమంలో గ్యాస్ సిలిండర్ పైపు లీకేజీ కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఆదుపు కాకపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకొని మంటలు అదుపు చేశారు. ఈ ప్రమాదంలో తలుపు, గ్యాస్ సిలిండర్ కాలిపోయాయి. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అక్కడికి వెళ్లి, వివరాలు తెలుసుకున్నారు.

ఆలయంలో చోరి

కాగజ్‌నగర్, జనవరి 31 : కాగజ్‌నగర్ పట్టణం ఓల్డ్ కాలనీలోని ఉమా మహేశ్వర మార్కండే ఆలయంలో గురువారం రాత్రి 2 గంటల ప్రాంతంలో హుండీ చోరికి గురైనట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. గుర్తు తెలియని దుండగుడు చోరీ చేసినట్లు స్పష్టం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి, విచారణ చేపట్టారు.

గద్దర్ జయంతి

దండేపల్లి/జన్నారం/కాసిపేట, జనవరి 31 : దండేపల్లి మండల కేంద్రంలో ప్రజా యుద్ధనౌక గద్దర్ జయంతిని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరుపుకున్నారు. అలాగే జన్నారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ప్రజా సంఘాలు, వివిధ పార్టీల నాయకులు, కాసిపేట మండలం దేవాపూర్ పంచాయతీలోని కమ్యూనిటీ హాల్‌లో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

జాతర ఆహ్వాన పత్రికలు అందజేత

రెబ్బెన, జనవరి 31 : గంగాపూర్ శివారులోని బాలాజీ వేంకటేశ్వరస్వామి జాతర ఫిబ్రవరి 11,12,13 తేదీల్లో జరుగనుండగా, శుక్రవారం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే బొజ్జు పటేల్, గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కొట్నాక తిరుపతి, పీసీసీ కార్యదర్శి సత్తు మల్లేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్, పార్లమెంట్ ఇన్‌చార్జి సుగుణకు జాతర అహ్వాన పత్రికలు అందించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ లెండుగురే జయరాం తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్‌రావు, ఆర్‌టీఏ మెంబర్ లావుడ్య రమేశ్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మోడెం సుదర్శన్‌గౌడ్, మాజీ సర్పంచ్ లెండుగురే గంటుమేర, నాయకులు వనమాల మురళీ, గుంపుల విమలేశ్, తులసీరాం, దత్తు, రాంచందర్, అడప విమల, పల్లాస్, గోగర్ల రాజేశ్, సంతోష్, వెంకట్రావ్ పాల్గొన్నారు.

టీఎన్జీవో సభ్యత్వం 90 శాతం పూర్తి

హాజీపూర్, జనవరి 31 : జిల్లాలో తెలంగాణ నాన్ గెజిటెడ్ (టీఎన్జీవో) ఉద్యోగుల సంఘం సభ్యత్వ నమోదు 90 శాతం పూర్తయినట్లు జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిని సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి భూముల రామ్మోహన్, కేంద్రం సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు

సీసీసీ నస్పూర్, జనవరి 31 : నస్పూర్‌లోని కేజీఏ డిఫెన్స్ అకాడమీ మైదానంలో అండర్–15 బాలబాలికల రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఆవునూరి మహేశ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి భీమిని రాజేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3వ తేదీ వరకు పోటీలు జరుగుతాయని, రాష్ట్రంలోని 25 జిల్లాలకు చెందిన దాదాపు 600మంది క్రీడాకారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

అటవీ అధికారుల ఆంక్షలను ఎత్తివేయాలి

జన్నారం, జనవరి 31 : కవ్వాల్ టైగర్ రిజర్వు అటవీ అధికారులు విధించిన ఆంక్షల వల్ల మండల ప్రజలకు తీవ్ర ఇబ్బందు కలుగుతాయిని, ఎత్తివేయాలని సామాజిక కార్యకర్త శ్రీరాముల భూమాచారి అన్నారు. హరిత రిసార్ట్‌లో శుక్రవారం వివిధ పార్టీల నాయకులతో కలసి రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆంక్షలు ఎత్తివేసే వరకు ఉద్యమం చేపట్టాలని తీర్మానం చేశారు. అఖిల పక్షనాయకులు, విద్యార్థి, వ్యాపార, వర్తక సంఘం నాయకులు పాల్గొన్నారు.